ప్రజాశక్తి
మంగళవారం 23 సెప్టెంబర్ 2025 5 విజయనగరం



జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

రాబోయే ఐదు రోజుల్లో జిల్లాలో కొన్ని చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని కలెక్టర్ రామసుందర్‌రెడ్డి తెలిపారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఆర్‌డిఒ, తహశీల్దార్, మున్సిపల్ కమిషనర్ కార్యాలయాల్లో కంట్రోల్ రూములు ఏర్పాటు చేసి పరిస్థితిని పర్యవేక్షించాలని ఆదేశించారు. అధికారులు అప్రమత్తంగా ఉండి వర్షాల కారణంగా జరిగే నష్టాలను కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నంబర్ 08922-236947కు తెలియజేయాలని సూచించారు. వ్యవసాయ, ఉద్యాన, పట్టు శాఖాధికారులు పంటల నష్టాలను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు చెరువుల నీటిమట్టాలను పర్యవేక్షించాలని సూచించారు. భారీ వర్షాల కారణంగా ఎటువంటి నష్టం జరిగినా, వెంటనే కలెక్టర్ కార్యాలయ డి-శాఖ ఇ-మెయిల్ : dsuperintendent123@gmail.comకు తెలియజేయాలని కలెక్టర్ ఆదేశించారు.

పనిగంటల పెంపును ఉపసంహరించుకోవాలని

సిఐటియు ఆధ్వర్యాన ఆందోళనలు

కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పనిదినాన్ని 13 గంటలకు పెంచుతూ, మహిళలతో నైట్‌షిఫ్ట్‌లో పనిచేయించుకోవడానికి అనుమతిస్తూ చేసిన చట్ట సవరణ బిల్లులను వెంటనే ఉపసంహరించుకోవాలని సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టి.వి.రమణ మాట్లాడుతూ కార్మికవర్గం పోరాడి 8 గంటల పని దినాన్ని సాధించుకుందని గుర్తుచేశారు. రాష్ట్రంలో 8 గంటల పని దినాన్ని 13 గంటలకు పెంచుతూ శాసనసభలో చట్ట సవరణ చేయడంపై ఆందోళన వ్యక్తం చేశారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో కూడా పని గంటల పెంపు చట్ట సవరణ జరగలేదని చెప్పారు. ప్రధాని మోడీ మెప్పు కోసం సిఎం చంద్రబాబు రాష్ట్రంలో కార్మిక వర్గాన్ని యజమానులకు తాకట్టు పెట్టాలని చూస్తే తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. శాసనమండలిలో పని గంటల పెంపు తీర్మానాన్ని అడ్డుకోవాలని వైసిపి ఎమ్మెల్సీలకు విజ్ఞప్తి చేశారు. రాత్రిపూట మహిళలతో పని చేయించేందుకు అనుమతించడం హేయమైన చర్యగా అభివర్ణించారు. 2011 నుంచి కనీస వేతనాల చట్ట సవరణ జరగలేదని, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, డైలీ వేజ్, ప్రభుత్వ పథకాల్లో పనిచేస్తున్న అనేక మంది కార్మికులు కనీస వేతనాల చట్టపరిధిలో లేరని తెలిపారు. చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే తక్షణమే కనీస వేతన చట్ట సవరణ చేసి, కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.సురేష్, కోశాధికారి ఎ.జగన్మోహనరావు, ఉపాధ్యక్షులు పి.శంకర్రావు, యుఎస్ రవికుమార్, బి.సుధారాణి, బి.సూర్యనారాయణ, నగర కార్యదర్శి బి.రమణ, నాయకులు బలసా శ్రీను, సుధీర్, భాస్కర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

గరివిడి: స్థానిక తహశీల్దార్ కార్యాలయం అంబేద్కర్ విగ్రహం వద్ద 8 గంటల పనిని 13 గంటలకు పెంచడాన్ని నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సిఐటియు నాయకులు అంబళ్ల గౌరి నాయుడు, జె విశ్వనాథరాజు మాట్లాడుతూ కార్మికులు కూడా మనుషులేనన్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలని 8 గంటల పని దినాలను 13 గంటలకు పెంచుతూ అసెంబ్లీలో ఆమోదం పొందడాన్ని వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కంది రామారావు, కాంట్రాక్టర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి చంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

గరివిడిలో ఆందోళన చేస్తున్న నాయకులు, కార్మికులు

పూసపాటిరేగ: స్థానిక బ్రిడ్జి సెంటర్‌లో నాలుగు లేబర్ కోడ్లను, పని గంటల పెంపును వ్యతిరేకిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి బి.సూర్యనారాయణ మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం 13 గంటల పని విధానాన్ని అమలులోకి తేవడానికి బిల్లును ఆమోదించడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మహిళల రక్షణకు ఏర్పాటైన కొన్ని నిబంధనలను తొలగించి రాత్రి షిఫ్టుల్లో కూడా మహిళలను పనిచేయించడానికి అనుమతించడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో కోలా హరిప్రసాద్, బి.రామ్‌నాయుడు, శ్రీనివాస్, రామకృష్ణ పాల్గొన్నారు.

నెల్లిమర్ల : 13గంటల పని దినాలు వ్యతిరేకించాలని సిఐటియు జిల్లా కమిటి సభ్యులు కిల్లంపల్లి రామారావు పిలుపునిచ్చారు. విద్యుత్ కార్మికులతో ఆయన మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం కూడా 13 గంటల పని విధానం అమోదించడం దుర్మార్గమన్నారు. ఇప్పటికే పనిభారంతో కార్మిక వర్గం ఇబ్బందులు పడుతుంటే 13గంటల పనిభారం కార్మికులకు విశ్రాంతి లేకుండా అనారోగ్యానికి గురవుతారని చెప్పారు. కార్యక్రమంలో విద్యుత్ కార్మికులు పి.లక్ష్మణరావు, ఎల్.గోవిందరావు, పి.రాంబాబు, కె.శ్రీను పాల్గొన్నారు.

13 గంటల పనివిధానం దారుణం

బొబ్బిలి: పని దినాన్ని 13 గంటలకు పెంచడం దారుణమని ఎపిటిఎఫ్ రాష్ట్ర నాయకులు జెసి రాజు విమర్శించారు. ఎపిటిఎఫ్ కార్యాలయంలో సిహెచ్‌జె ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో జెసి రాజు మాట్లాడుతూ కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాల్లో కొన్నిటిని లేబర్ కోడ్లుగా మార్చి కార్మికులను బానిసలుగా చేసేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ సమావేశంలో అర్‌ఎన్ రాజు, అప్పారావు, చిన్నారావు, శంకరరావు, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

జిందాల్ నిర్వాసితులకు

బెదిరింపులు

- పోరాటాన్ని అణచివేసేందుకు కుట్ర
- రోజుకొక్కర్ని పోలీసుస్టేషన్‌కు పిలిపిస్తున్న వైనం
- పోలీసుల తీరుపై సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ ఆగ్రహం

నిరసన చేపడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని, జిందాల్ నిర్వాసితులు (ఫైల్)

ప్రజాశక్తి-శృంగవరపుకోట

జిందాల్ నిర్వాసితుల పోరాటాన్ని అణచివేసేందుకు ప్రభుత్వం పూనుకుందా? జిందాల్ యాజమాన్యానికి అనుకూలంగా చర్యలకు ఉపక్రమించిందా? అందుకోసం పోలీసులను ఉసిగొల్పిందా?.. అంటే, జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే అవుననే సమాధానమే వినిపిస్తోంది. చట్ట ప్రకారం తమకు న్యాయం చేయాలని నిర్వాసితులు మూణ్నెల్లుగా పోరాడుతుంటే, పోలీసుల ద్వారా సర్కారు బెదిరింపు చర్యలకు దిగింది. అందులో భాగంగా నిర్వాసితులకు మద్దతుగా నిలిచిన వారిని ఒక్కొక్కరిని పోలీసుస్టేషన్‌కు పిలిపించి, పోరాటం నుంచి వెనక్కి తగ్గాలని హుకుం జారీ చేస్తోంది. ప్రభుత్వ, పోలీసుల తీరుపై సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ ఆగ్రహం వ్యక్తంచేశారు.

జిందాల్ అల్యూమినియం కర్మాగారం నిర్మిస్తామని శృంగవరపుకోట మండలంలోని నాలుగు పంచాయతీల్లో 26 గ్రామాల నుంచి సుమారు 1166 ఎకరాల భూమిని సేకరించింది. భూమి తీసుకుని 18 ఏళ్లయినా కంపెనీ మాత్రం కట్టలేదు. నష్టపరిహారం చెల్లించడంతోపాటు కంపెనీ పెట్టాక అందులో షేర్లు, ఉద్యోగాలు ఇస్తామని జిందాల్ సంస్థ అప్పట్లో నమ్మబలికింది. వాస్తవానికి ఐదేళ్లలోపు పరిశ్రమలు పెట్టకపోతే భూమి వెనక్కి తీసుకుని, రైతులు లేదా సంబంధిత భూమి యజమానులకు ఇప్పించాలి. ఈ విషయం భూసేకరణ చట్టం -2013లో స్పష్టంగా పేర్కొన్నారు. ప్రభుత్వం మాత్రం ఆ పని చేయలేదు సరికదా, ఎంఎస్ఎంఇ పార్కు పేరుతో సంబంధిత సంస్థకు భూమి మొత్తం కట్టబెట్టింది. ఈ విషయంలో మోసపోయిన రైతులు గగ్గోలు పెట్టినప్పటికీ, ప్రభుత్వానికి వినిపించలేదు. దీంతో సిపిఎం, ఎపి రైతుసంఘం ఆధ్వర్యాన 95 రోజులుగా నిర్వాసితులు బొడ్డవరలో శాంతియుతంగా వివిధ రూపాల్లో నిరసనలు చేపడుతున్నారు. జిందాల్ భూ సేకరణలో ఎటువంటి చట్టాలు అమలు చేయకుండా తీసుకున్న భూమిని వెంటనే భూములు కోల్పోయిన పేదలకు అప్పగించాలని కోరుతున్నారు. నిర్వాసితులతో కలిపి పోరాటం చేస్తుంటే కొత్తగా జిఒ నెంబర్ 14ని తీసుకొచ్చి భూములను ప్లాట్లుగా వేసి అమ్ముకోడానికి సిద్ధమయ్యారు. ఇది చట్ట వ్యతిరేకమని ప్రశ్నిస్తున్న వారిని శృంగవరపుకోట పోలీస్‌స్టేషన్‌కు పిలిచి పోలీసులు బెదిరింపు చర్యలకు దిగుతున్నారు. అందులో భాగంగా సిపిఎం నాయకులు చల్లా జగన్‌ను సోమవారం రోజంతా స్టేషన్‌లో నిర్బంధించారు. చట్ట ప్రకారం ఆ భూములను రైతులకు తిరిగి అప్పగించాలని, ప్రభుత్వాలే చట్టాలను పాటించకపోతే ఇక పేదలకు న్యాయం ఎక్కడ జరుగుతుందని పలువురు ప్రజాసంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు.

కవ్వింపు చర్యలకు దిగితే ఊరుకోం

జిందాల్ భూముల వ్యవహారంలో ప్రభుత్వం చట్టాలను ఎందుకు అమలు చేయడం లేదు? జిందాల్ నిర్వాసితులకు తిరిగి భూములిచ్చే వరకూ పోరాటం కొనసాగుతుంది. మేం పరిశ్రమలకు వ్యతిరేకం కాదు. ప్రివెంటివ్ అరెస్టు పేరుతో సిపిఎం నాయకుడిని అరెస్టు చేశారు. ఆందోళన, ధర్నాలకు ముందస్తు పిలుపునివ్వకుండా ఆ పేరుతో ఎలా అరెస్టు చేస్తారు? ఈ ఓవరాక్షన్ ఎవరి ఆనందం కోసం చేస్తున్నారో ప్రజలకు అర్థమవుతుంది. జిందాల్ యాజమాన్యం తరపున పోలీసులు బెదిరింపులు, కవ్వింపు చర్యలకు దిగితే చూస్తూ ఊరుకోం. బెదిరింపు చర్యలతో ఉద్యమాలను ఆపలేరు. పోరాటాన్ని ఇంకా ఉధృతం చేస్తాం.

- సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

అర్జీదారుకు సరైన సమాధానం ఇవ్వాలి

- కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి
- పిజిఆర్ఎస్‌కు 240 వినతులు

కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న వృకాస నాయకులు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ప్రజా వినతుల పరిష్కార వేదికకు వచ్చే వినతులకు సరైన సమాధానం ఇవ్వాలని కలెక్టర్ ఎస్.రామ సుందర్ రెడ్డి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ ప్రతిరోజూ లాగిన్ అయి అధికారులు వినతులను చూడాలని, రీ ఓపెన్ కేసులు కూడా పూర్తిగా విచారించి, ముగించాలని తెలిపారు. గడువు లోపలే వినతులకు సమాధానాలు పంపాలని, లేకుంటే సంబంధిత అధికారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్‌కు 240 వినతులు అందాయి. కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, డిఆర్ఒ శ్రీనివాసమూర్తి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వెంకటేశ్వర రావు, ప్రమీల గాంధీ, మురళి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 240 అర్జీలు అందగా, భూ సమస్యలకు సంబంధించి రెవెన్యూ శాఖకు అత్యధికంగా 106 వినతులు అందాయి. పంచాయతీ శాఖకు 15, పింఛన్లు మంజూరు చేయాలని తదితర అంశాలపై డిఆర్‌డిఎకు 28 వినతులు అందాయి. మున్సిపాలిటీకి 9, విద్యా శాఖకు 2, హౌసింగ్‌కు 2, వైద్య శాఖకు 11, విద్యుత్ శాఖకు 5 వినతులు అందాయి.

ప్రజల సంతృప్తి స్థాయి పెరగాలి

పిజిఆర్ఎస్ వినతులపై ప్రజల సంతృప్తి స్థాయి పెరగాలని కలెక్టర్ రామసుందర్‌రెడ్డి తెలిపారు. పిజిఆర్ఎస్‌పై కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్షలో ఆయన మాట్లాడారు. మండల స్థాయిలో సమస్యలను పరిష్కరించాలని ఎంపిడిఒలు, తహశీల్దార్లను ఆదేశించారు. మ్యూటేషన్, వన్‌బి నమోదు, భూముల స్వరూపంపై తహశీల్దార్లు పూర్తి అవగాహన కలిగి ఉండాలని స్పష్టం చేశారు. మాజీ సైనికులకు కేటాయించిన భూములపై నిబంధనలు పరిశీలించి తగిన విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్, డిఆర్ఒ ఎస్.శ్రీనివాసమూర్తి, పిజిఆర్ఎస్ నోడల్ అధికారి మురళి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థల లీజును రద్దు చేయాలి

విజయనగరం టౌన్ : 2010 సంవత్సరంలో హస్తకళల కోసం బొబ్బిలి ఐటిఐ పక్కనున్న సుమారు రెండు ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం పర్యాటక శాఖకు కేటాయించిందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.శంకర్రావు, మండల కార్యదర్శి సింగిరెడ్డి గోపాలం అన్నారు. ఆ స్థలాన్ని పర్యాటక శాఖ బిజెపి నాయకులకు 50 ఏళ్లపాటు రిసార్ట్ వ్యాపారం నిమిత్తం కేటాయించినట్లు తెలిసిందని, ఈ లీజులు తక్షణమే రద్దు చేయాలని పిజిఆర్ఎస్‌లో కలెక్టర్‌కి వినతి పత్రం అందజేశారు. బొబ్బిలి పట్టణంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీలు లేవని, కార్మిక వర్గానికి ఇఎస్ఐ ఆస్పత్రి లేదని, బిసి వసతిగృహం కోమటిపల్లిలో అద్దె భవనంలో, ఆర్‌డిఒ కార్యాలయం ఎపిఐఐసి భవనంలో ఉన్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ఖాళీ స్థలాన్ని ప్రభుత్వ అవసరాలకు ఉపయోగించకుండా బిజెపి నాయకులకు లీజుకు కేటాయించడం దారుణమన్నారు. కలెక్టర్ తక్షణమే జోక్యం చేసుకొని లీజ్ ఒప్పందాలు రద్దు చేయాలని కోరారు.

సాగుభూములకు పట్టాలివ్వాలని ధర్నా

ప్రజాశక్తి-విజయనగరంకోట

అసైన్డ్ కమిటీ ఏర్పాటు చేసి, పేదల సాగు భూములకు పట్టాలు మంజూరు చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, ఆదివాసీ గిరిజన సంఘం, కెవిపిఎస్, కౌలురైతు సంఘం సంయుక్త ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా దళిత, గిరిజనులు, ఇతర పేదలు తరతరాలుగా బంజరు, కొండ పోరంబోకు, ప్రభుత్వ భూములను సాగు చేస్తూ జీవిస్తున్నారన్నారు. ఆ భూములకు పట్టాలు లేక అన్నదాత సుఖీభవ, బ్యాంకు రుణాలు, పంట నష్టపరిహారం, ప్రభుత్వం ద్వారా భూమి అభివృద్ధి పనులు, ఇతర రాయితీలు పొందలేక పోతున్నారని చెప్పారు. తక్షణమే పట్టాలు పొందాలన్నా అసైన్డ్ కమిటీ లేదని తెలిపారు. అసైన్డ్ కమిటీ లేకున్నా పట్టాలు ఇస్తామని చెప్తున్నారని, కానీ అది ఆచరణకు నోచుకోవడం లేదని వివరించారు. స్థానికంగా సిఫార్సులు చేసి ఆమోదానికి పెట్టడం లేదన్నారు. అసైన్డ్ కమిటీ ఏర్పాటు చాలా ఆవశ్యకతతో కూడుకున్నదన్నారు. జిల్లాలో కొన్ని మండలాల్లో మాత్రమే పేదలను సర్వే చేసి గుర్తించారన్నారు. ఇతర మండలాల్లో కూడా సర్వే చేస్తే సాగు చేస్తున్న భూమి వివరాలు తెలుస్తాయని చెప్పారు. తక్షణమే అసైన్డ్ కమిటీ ఏర్పాటుచేసి, పేదలు సాగుచేస్తున్న భూములకు పట్టాలిచ్చేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాస్, జి.అప్పారావు, ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు, గిరిజన సంఘం జిల్లా కన్వీనర్ టి.సోములు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రాకోటి ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం పడిగాపులు కాస్తున్న రైతులు

తప్పని యూరియా పాట్లు

ప్రజాశక్తి - గుర్ల

యూరియా కోసం రైతులకు ఇక్కట్లు తప్పడం లేదు. యూరియాకి లోటు లేదని అధికారులు చెబుతున్నా, వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. దీనికి ఎరువుల షాపుల వద్ద వేచివున్న రైతులే నిదర్శనం. గుర్లలో సోమవారం ఓ ప్రయివేటు డీలర్ యూరియా అమ్ముతున్నట్లు సమాచారం తెలుసుకున్న రైతులు యూరియా కోసం షాపు దగ్గరకు చేరుకుని క్యూ కట్టారు. గత వారం ఎఒ కార్యాలయం దగ్గర ఇచ్చిన స్లిప్‌కు యూరియా ఇవ్వాలని రైతులు గట్టిగా నిలదీయడం, స్లిప్‌లు లేకుండా యూరియా కోసం కొత్తగా వచ్చినవారి సంఖ్య ఒక్కసారిగా పెరిగిపోవడంతో గందరగోళం నెలకొంది. దీంతో చేసింది లేక అధికారులు యూరియా పంపిణీ మంగళవారానికి వాయిదా వేసినట్లు చీపురుపల్లి ఎడిఎ కోటేశ్వరరావు తెలిపారు.

పశుసంవర్ధక శాఖ జెడిగా మురళీకృష్ణ

ప్రజాశక్తి-విజయనగరంకోట

పశుసంవర్ధక శాఖ జెడిగా కె.మురళీకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పశ్చిమగోదావరి జిల్లా పశుసంవర్ధక శాఖాధికారిగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఇంతవరకు ఇన్‌ఛార్జి జెడి దామోదరనాయుడు నుంచి బాధ్యతలు స్వీకరించారు.

రైతుల అభివృద్ధికి సహకరించాలి

ఆప్కాబ్ ఎమ్‌డికి డిసిసిబి ఛైర్మన్ వినతి



ఆప్కాబ్ ఛైర్మన్‌కు వినతి అందిస్తున్న నాగార్జున

ప్రజాశక్తి-విజయనగరంకోట

విజయనగరం జిల్లా రైతుల అభివృద్ధికి సహకారం అందించాలని డిసిసిబి ఛైర్మన్ కిమిడి నాగార్జున.. ఆప్కాబ్ ఎమ్‌డి ఆర్.శ్రీనాథ్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు సోమవారం విజయవాడలో ఆయన్ను కలిసి జిల్లాలో రైతుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ జిల్లాలో రైతులకు ఇచ్చే పంట రుణాల కోసం అదనంగా నిధులు మంజూరు చేయాలని కోరారు. ప్రస్తుతం ఐదు శాతంగా ఉన్న జనరల్ బ్యాంకింగ్ లిమిట్‌ను అదనంగా మరో ఐదు శాతం పెంచాలని విజ్ఞప్తిచేశారు. వ్యవసాయ పరికరాలు అందించటానికి సహకరించాలన్నారు.

విజయనగరం ఉత్సవాలకు

క్రెడాయ్, బిసిఎ, ఎల్‌టిపిఎల సహకారం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం ఉత్సవాల నేపథ్యంలో క్రెడాయ్, భవన నిర్మాణ సంఘాలు, లైసెన్స్ టెక్నికల్ పర్సన్స్ అసోసియేషన్ ప్రతినిధులు సహకారాన్ని అందించేందుకు ముందుకొచ్చారు. సోమవారం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు వారు హామీ ఇచ్చారు. ప్రతి ఏటా విజయనగరం ఉత్సవాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందేనని, ఈ నేపథ్యంలో పలువురు ముందుకు వచ్చి సహకారాన్ని అందిస్తామని చెప్పడం హర్షించదగ్గ పరిణామమని కమిషనర్ అన్నారు. సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్లు రమణమూర్తి, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ శాఖలో మార్పులు తేవాలి

కంటోన్మెంట్ : రాష్ట్రంలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో మౌలికమైన మార్పులు తీసుకు రావాలని ఆ శాఖ ఐజి బిఆర్ అంబేద్కర్‌ని రాష్ట్ర పౌర వేదిక అధ్యక్షులు బీశెట్టి బాబ్జి కోరారు. సోమవారం ఐజిగా బాధ్యతలు తీసుకున్న అంబేద్కర్‌ని మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

ఇనాం రైతుల నిరసన

నిరసన తెలుపుతున్న ఇనాం రైతులు

ప్రజాశక్తి-విజయనగరం కోట

తరాలుగా సాగు చేస్తున్న ఇనాం భూమికి సంపూర్ణ భూ యాజమాన్య హక్కులు కల్పించాలని కలెక్టరేట్ వద్ద చీపురుపల్లి మండలం జి.అగ్రహారం గ్రామానికి చెందిన ఇనాం రైతులు నిరసన చేపట్టారు. పాస్ పుస్తకాలు ఇప్పించాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ యాజమాన్య హక్కులు లేకపోవడంతో తోటపల్లి కాలువకు ఇచ్చిన భూమికి పరిహారం అందలేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతు భరోసా డబ్బులు వచ్చాయని, ప్రస్తుత ప్రభుత్వం నుంచి అన్నదాత సుఖీభవ పథకం డబ్బులు రాలేదని చెప్పారు. కార్యక్రమంలో ఎల్ఎన్‌టి సూర్యారావు, లక్ష్మణ్, రాము, డిఎ నాయుడు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై చట్టపరిధిలో చర్యలు

ఎస్‌పి ఎ.ఆర్ దామోదర్

అర్జీదారుతో మాట్లాడుతున్న ఎస్‌పి దామోదర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

పిజిఆర్ఎస్‌కు అందిన ఫిర్యాదులపై చట్టపరిధిలో చర్యలు తీసుకోవాలని ఎస్‌పి ఎఆర్ దామోదర్.. పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పిజిఆర్ఎస్ నిర్వహించి, అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి 31 ఫిర్యాదులు అందాయి. ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించిన ఎస్‌పి వారి సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత పోలీసు అధికారులతో కాన్ఫరెన్సులో మాట్లాడారు. కార్యక్రమంలో ఎఎస్‌పి పి.సౌమ్యలత, ఎస్‌బి సిఐ ఎ.వి.లీలారావు, డిసిఆర్‌బి సిఐ బి.సుధాకర్, ఎస్ఐ ప్రభావతి, సిబ్బంది పాల్గొన్నారు.

డిపిటిసిలో మౌలిక వసతులు కల్పించాలి

జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో మౌలిక వసతులు కల్పించాలని ఎస్‌పి ఎఆర్ దామోదర్ పోలీసు అధికారులను ఆదేశించారు. సారిపల్లిలోని డిపిటిసిని ఎస్‌పి సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. జిల్లా పోలీసు శిక్షణ కేంద్రానికి త్వరలో సుమారు 140 మంది ట్రెయినీ కానిస్టేబుళ్లు శిక్షణకు వస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎఆర్ ఎఎస్‌పి జి.నాగేశ్వరరావు, డిపిటిసి డిఎస్‌పి ఎం.వీరకుమార్, పాల్గొన్నారు.

పండగ ఏర్పాట్లు పరిశీలన

పైడితల్లమ్మ ఆలయాన్ని ఎస్‌పి దామోదర్ సందర్శించి, పూజలు చేశారు. పైడితల్లమ్మ పండగ ఏర్పాట్లను పరిశీలించారు.

జెఎన్‌టియులో ఘనంగా మైఖేల్ పరేడ్ జయంతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెఎన్‌టియుజివిలో ఇఇఇ విభాగం ఆధ్వర్యంలో ప్రఖ్యాత శాస్త్రవేత్త మైఖేల్ పరేడ్ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 'ఎనర్జీ మేనేజ్‌మెంట్' అనే అంశంపై విశ్రాంత ఎస్ఇ రమణారావు మాట్లాడారు. శక్తి సంరక్షణ, పునరుత్పాదక వనరుల సమర్థ వినియోగం, విద్యుత్ సామర్థ్యం పెంపుదలపై దృష్టిపెట్టాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా ప్రాజెక్ట్ ఎక్స్‌పో నిర్వహించారు. ఇందులో ఆటోమేటిక్ కార్ పార్కింగ్ సిస్టమ్ ప్రథమ బహుమతి సాధించింది. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ జి. జె. నాగరాజు, విభాగాధిపతి వి.ఎస్.వకులా, కన్వీనర్ ఎ.పద్మజ పాల్గొన్నారు.

జీతాలు ఇవ్వకుంటే పస్తులతో ఉండాలా?

పంచాయతీ కార్మికులు, గ్రీన్ అంబాసిడర్ల ఆందోళన

ఆందోళన చేస్తున్న పంచాయతీ కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

కష్టపడి పని చేసినా జీతాలు ఇవ్వకపోతే పస్తులతో పని చేయాలా? అంటూ పంచాయతీ కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద గ్రామ పంచాయతీ కార్మికులు, గ్రీన్ అంబాసిడర్ల సంఘం (సిఐటియు అనుబంధం) ఆధ్వర్యాన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.సురేష్ మాట్లాడుతూ చెత్త రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దామని ముఖ్యమంత్రి చంద్రబాబు, గ్రామాలను అభివృద్ధి చేసి తీర్చిదిద్దుతామని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పదే పదే ప్రకటిస్తున్నా.. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతున్న పంచాయతీ కార్మికులను, గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు నెలల తరబడి ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. గ్రీన్ అంబాసిడర్లకు అనేక చోట్ల మూడేళ్లుగా జీతాలు చెల్లించకుండా వెట్టిచాకిరీ చేయిస్తున్నారని, వారి కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. దసరాలోగా 15వ ఆర్థిక సంఘం నిధులు జీతాలకు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ధరలకు అనుగుణంగా జీతాలు పెంచకపోవడం సరైంది కాదన్నారు. కనీస వేతనం రూ.21 వేలు, ప్రమాద బీమా రూ.10 లక్షలు చెల్లించాలని, దహన సంస్కారాలకు రూ.20 వేలకు పెంచాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.లక్ష్మి, ఎ.జగన్మోహన్, జిల్లా కమిటీ సభ్యులు బి.శ్రీను, సిహెచ్.ముత్యాలు, వెంకటరావు, పంచాయతీ, గ్రీన్ అంబాసిడర్స్ యూనియన్ నాయకులు రాంబాబు, దేవా, అప్పయ్యమ్మ, అప్పయ్యమ్మ, సూరిబాబు, భవాని, సన్యాసి, కృష్ణమ్మ, చిన్న తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర ర్యాంకు మెరుగుపడాలి

కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లాలో స్వచ్ఛాంధ్ర ర్యాంకు మెరుగుపడేలా అధికారులు పని చేయాలని కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి తెలిపారు. సోమవారం కలెక్టర్ తన ఛాంబర్‌లో సాసా కార్యక్రమాలపై సమీక్షించారు. సెప్టెంబర్ వరకు రాష్ట్ర స్థాయిలో జిల్లా ప్రతి నెలా 9 నుండి 11 మధ్య ర్యాంకుల్లో ఉంటోందని, సాసా కార్యక్రమాలు చురుకుగా సాగుతున్నా రిపోర్టింగ్ కచ్చితంగా చేయడం ముఖ్యమని అన్నారు. సంబంధిత యాప్‌లో నమోదు చేయడం కూడా ప్రధాన విధిగా భావించాలని చెప్పారు. ఈ సాసా కార్యక్రమాలపై ప్రతి రోజూ టెలీకాన్ఫరెన్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సిపిఒ బాలాజీ, సిఇఒ సత్యనారాయణ, డిపిఒ మల్లికార్జునరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ కవిత, మున్సిపల్ కమిషనర్లు నల్లనయ్య, రామలక్ష్మి, అప్పలనాయుడు, వర్చువల్‌గా ఎంపిడిఒలు, తదితరులు పాల్గొన్నారు.

మరో 1,10,915 మంది అక్షరాస్యులుగా..

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లాలో మరో 1,10,915 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ అక్షరాంధ్ర లక్ష్యమని కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం పిజిఆర్ఎస్ అనంతరం అక్షర వాచకం పుస్తకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డిఆర్‌డిఎ ద్వారా 60,715 మంది, మెప్మా ద్వారా 12 వేల మంది మహిళలను, డ్వామా ద్వారా 38,200 మంది పురుషులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని సూచించారు. రానున్న మూడు నెలల్లో వంద గంటలు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. కోర్స్ పూర్తి చేసిన వారికి నేషనల్ ఓపెన్ స్కూల్ ద్వారా ఎఫ్ఎల్అండ్‌టి పరీక్ష నిర్వహిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో జెసి సేతుమాధవన్, డిఆర్ఒ ఎస్.శ్రీనివాసమూర్తి, ఎస్‌డిసిలు వెంకటేశ్వరరావు, ఇ.మురళి, నూకరాజు, ప్రమీల గాంధీ, వయోజన విద్య నోడల్ అధికారి ఎ.వేణుగోపాల్, డిఆర్‌డిఎ, డ్వామా, మెప్మా పీడీలు శ్రీనివాస్, శారదాదేవి, చిట్టిరాజు, తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు

ప్రజాశక్తి - గజపతినగరం

పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా ముందస్తు చర్యల్లో భాగంగా మండల వ్యాప్తంగా విస్తృతంగా పర్యటించి మరుపల్లి ప్రభుత్వ పశు వైద్యాధికారి అవినాష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఉచిత టీకాలు వేశారు. సోమవారం గంగుచోళ్లపెంట గ్రామంలో జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా 280 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను ఉచితంగా వేశారు. అనంతరం పశువైద్యాధికారి అవినాష్ మాట్లాడుతూ జిల్లా పశుసంవర్ధక శాఖ జెడి దామోదర్ రావు ఆధ్వర్యంలో 3.10లక్షల గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు సెప్టెంబర్ 15 నుంచి అక్టోబర్ 15 లోపు ఉచితంగా వేస్తామన్నారు. పశుపోషకులు ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకునే ముందస్తుగా వ్యాధి నివారణకు ముందుకు రావాలని రైతులకు అవగాహన కల్పించారు. పశుసంవర్ధక సహాయకులు ఎం. సతీష్, వి. రమేష్, గోపాలమిత్ర సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం

ప్రజాశక్తి - బొబ్బిలి

ప్రజా సమస్యలు పరిష్కారానికి పోరాటం చేయాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మరిపి విద్యాసాగర్ కోరారు. స్థానిక రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో సోమవారం నియోజకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని విమర్శించారు. ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కారానికి పని చేయాలన్నారు. స్థానిక సంస్థలు ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. భూ కబ్జాలు, కాలువలు, రోడ్లు సమస్యలపై చర్చించినట్లు నియోజకవర్గ ఇంచార్జ్ ఎం.శ్రీనివాసరావు చెప్పారు. సమావేశంలో నియోజకవర్గ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి ముగింపు

ప్రజాశక్తి - చీపురుపల్లి

ఈ నెల 17వ తేదీన ప్రారంభమైన విశ్వకర్మ జయంతి ఉత్సవాలు సోమవారంతో ఘనంగా ముగిసాయి. ఈ సందర్భంగా స్థానిక వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద భారీ ఎత్తున అన్న ప్రసాద వితరణను విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం విశ్వకర్మ విగ్రహాన్ని చీపురుపల్లి పురవీధులలో మేల తాళాల మధ్య ఊరేగించారు. అన్న ప్రసాదం వితరణ కార్యక్రమంలో సుమారు 4వేల మంది వరకు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు మారోజు చక్రధర్, కార్యదర్శి పట్నాని ఈశ్వరరావు, గౌరవాధ్యక్షుడు బోనుమద్ది ఆచారితో పాటు విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం సభ్యులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అడ్వాన్స్ స్కౌట్ మాస్టర్స్ శిక్షణలో ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - వేపాడ

ఇటీవల జిల్లాలో జరిగిన భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అడ్వాన్స్ స్కౌట్ మాస్టర్స్ శిక్షణ కార్యక్రమంలో సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయులు, బేసిక్ స్కౌట్ మాస్టర్ పి.రమేష్‌నాయుడు శిక్షణ పొందారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, జిల్లా కమిషనర్ (అడల్ట్ రిసోర్స్) బిపిఎ రాజు సోమవారం తెలిపారు. ఈ నెల 15 నుంచి 21వరకూ జిల్లాలోని వివిధ పాఠశాలల నుండి 32 మంది స్కౌట్ మాస్టర్స్ పాల్గొనగా వీరిలో రమేష్ నాయుడు పాల్గొని 7రోజుల శిక్షణ తీసుకున్నారని వివరించారు.

దేవి నవరాత్రులు ప్రారంభం

ప్రజాశక్తి - వేపాడ

వేపాడ, వల్లంపూడి గ్రామాల్లో సోమవారం దేవీ నవరాత్రుల ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ గ్రామాలలో ప్రధాన వీధిల్లో దేవి విగ్రహాన్ని బ్యాండు, సన్నాయి మేళాలు, డప్పు వాయిద్యాలతో, మందు గుండు సామాగ్రితో కాల్పులతో ఊరేగించారు. అనంతరం వల్లంపూడి బజార్ సెంటర్లో దేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, పెద్దలు, భవానిలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

రోడ్డు విస్తరణకు నిధులు మంజూరు చేయండి

ప్రజాశక్తి - బొబ్బిలి

పట్టణంలోని మార్కెట్ రోడ్డు విస్తరణకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే బేబినాయన కోరారు. నియోజకవర్గంలో రోడ్ల సమస్యలపై సోమవారం అసెంబ్లీలో ప్రస్తావించారు. మార్కెట్ రోడ్డు ఇరుకుగా ఉండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తడంతో ప్రజలు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోడ్ల విస్తరణ చేసేందుకు నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. చిలకపాలెం నుంచి బాడంగి, రామభద్రపురం, బొబ్బిలి మీదుగా రాయగడ రోడ్డు బాగు చేసేందుకు నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పారాది వంతెన నిర్మాణ పనులు జరుగుతున్నాయని, కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లిస్తే పనులు వేగంగా పూర్తి అవుతాయని చెప్పారు.

ఈవ్‌టీజింగ్ నిర్మూలనకు ప్రత్యేక నిఘా

ప్రజాశక్తి - నెల్లిమర్ల

కళాశాలలు, పాఠశాల వద్ద ఈవ్‌టీజింగ్ నివారణకు ప్రత్యేక నిఘా పెట్టినట్లు ఎస్ఐ బి.గణేష్ తెలిపారు. సోమవారం ఆయన ఆధ్వర్యంలో మిమ్స్ సమీపంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో సికెఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల, మిమ్స్ కాలేజ్, సతివాడ మోడల్ స్కూల్, జెడ్‌పి హైస్కూల్, జెటిఎన్ఎంఎం డిగ్రీ కాలేజీ పరిసర ప్రాంతాల్లో విద్యార్థులకు ఎటువంటి ఈవ్ టీజింగ్ జరగకుండా సీసీ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు.

నేడు విద్యుత్తు అంతరాయం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నెల్లిమర్ల సబ్ స్టేషన్ పరిధిలో మంగళవారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని టౌన్ డిఇఇ పి.త్రినాధరావు ఒక ప్రకటనలో తెలిపారు. 11కెవి లైన్ విస్తరణ, వ్యవసాయ కనెక్షన్ పనులు కొనసాగింపు కోసం నెల్లిమర్ల సబ్ స్టేషన్ 33/11కెవి పరిధిలో గుర్ల రూరల్ ఫీడర్11కెవి పరిధిలో మొయిద నారాయణ పట్నం, పూతిక పేట, కొండ గుంపాం, గరికిపేట, గుర్ల మండలంలోని చింతలపేట, పెదమజ్జిపేట గ్రామాలకు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 4 గంట వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

బొండపల్లిలో యూరియా పంపిణీ

ప్రజాశక్తి- బొండపల్లి

మండల కేంద్రమైన బొండపల్లి రైతు సేవా కేంద్రం వద్ద సోమవారం రైతులకు యూరియా పంపిణీ కార్యక్రమం సజావుగా జరిగింది. గజపతినగరం వ్యవసాయ సంచాలకులు నిర్మల జ్యోతి పర్యవేక్షణలో బొండపల్లి వ్యవసాయ అధికారి మల్లికార్జున రావు ఆధ్వర్యంలో ఈ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఎఒ మల్లికార్జునరావు మాట్లాడుతూ మరో రెండు రోజుల్లో పది టన్నుల యూరియా రావాల్సి ఉన్నందున రైతులు ఆందోళన చెందనవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు సి.హెచ్ బిందు, ఉద్యానవన సహాయకులు రహమాన్, రైతులు పాల్గొన్నారు.

పన్నులు సకాలంలో చెల్లించాలి

నెల్లిమర్ల: నగర పంచాయతీలో పన్నులు సకాలంలో చెల్లించాలని కమిషనర్ టి.జయరాం కోరారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంత్సరంలో అర్ధ సంవత్సరం ఈ నెల 30తో ముగుస్తుందని, వడ్డీ భారం మరింత పెరగకుండా వెంటనే ఆస్తి పన్ను, ఇంటి పన్ను, ఖాళీస్థలం పన్ను నీటి పన్నులు సకాలంలో చెల్లించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. మున్సిపల్ ఆఫీసులో, సిడిఎం యాప్ ఆన్‌లైన్ ద్వారా, సచివాలయంలో సకాలంలో చెల్లించి నగర పంచాయతీ అభివృద్ధికి సహకారించాలని కోరారు.

కాంట్రాక్టు దళారీ విధానం రద్దు చేయాలి

కంటోన్మెంట్: కాంట్రాక్టు దళారీ విధానం రద్దు చేయాలని ఎఐఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి బుగత అశోక్ కోరారు. ఈ మేరకు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఎదుట సోమవారం ఎపి మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన ధర్నా చేపట్టారు. ఆసుపత్రి శానిటేషన్, పెస్ట్ కంట్రోల్ వర్కర్స్, సెక్యూరిటీ గార్డులు, సూపర్వైజర్లకు ప్రభుత్వ ఇఒల ప్రకారం వేతనాలు చెల్లించాలని, కాంట్రాక్టు దళారీ విధానం రద్దు చేయాలని సూపరింటెండెంట్ అల్లు పద్మజకు వినతి అందించారు.

కులం పేరుతో దూషించిన వారిని అరెస్టు చేయండి

బొబ్బిలి: పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్న బిగులు లక్ష్మిపై కులం పేరుతో దూషించిన వ్యక్తిని తక్షణమే అరెస్టు చేయాలని కోరుతూ సిపిఐ జిల్లా సమితి సభ్యులు రాకోటి నాగమ్మ, బాధిత మహిళా బిగులు లక్ష్మి ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు సోమవారం వినతి పత్రం ఇచ్చారు. రాకోటి నాగమ్మ మాట్లాడుతూ బాధిత దళిత మహిళను బంటుపల్లి దివ్య కులం పేరుతో దూషించడమే కాక తరచూ మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తుందని ఈ నేపథ్యంలో ఈ నెల 13న బొబ్బిలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని చెప్పారు. కులం పేరుతో దూషించిన దివ్యపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేసినప్పటికీ ఇంతవరకు ఆమెను అరెస్టు చేయకపోవడంలో ఆంతర్యం ఏంటని ఆమె ప్రశ్నించారు.

బీమా ప్రీమియంపై జిఎస్‌టి ఉపసంహరణ..

ఎఐఐఇఎ సాధించిన గొప్ప విజయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పోరాట ఫలితంగానే ఆరోగ్య, జీవిత బీమా ప్రీమియంపై కేంద్రం జిఎస్‌టిని ఉపసంహరించుకుందని, ఇది ఎఐఐఇఎ సాధించిన గొప్ప విజయమని ఆ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.తిరుమలరావు, ఆర్.అప్పల నాయుడు తెలిపారు. సోమవారం ఎల్ఐసి కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడారు. జిఎస్‌టి అమలైనప్పటి నుంచి దీన్ని వ్యతిరేకిస్తూ 30 లక్షల పాలసీ ఖాతాదారుల సంతకాలతో అప్పటి కేంద్ర ఆర్థిక మంత్రికి లేఖ రాసినట్లు చెప్పారు. గత లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన వందలాది అభ్యర్థులను కలిసి ఎన్నికల మేనిఫెస్టోలో ఈ అంశం చేర్చాలని విజ్ఞప్తి చేసిందన్నారు. 2024 జూన్-జూలై నెలల్లో 400కి పైగా ఎమ్‌పిలను కలిసి జిఎస్‌టి వసూలు అన్యాయమని వివరించామన్నారు. నిరంతర పోరాటం ఫలితంగా, అన్ని పార్టీల మద్దతు లభించి, చివరికి జిఎస్‌టి కౌన్సిల్ ఈ అంశాన్ని చర్చించి ఉపసంహరణ నిర్ణయం తీసుకుందన్నారు. జీవిత, ఆరోగ్య బీమా పన్ను మినహాయింపు ప్రజల మౌలిక హక్కు, ఆరోగ్య సేవలపై పన్నులు విధించడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 హక్కుకు విరుద్ధమన్నారు. ఇది ప్రజలకు కొంత ఉపశమనం కలిగించినా, ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగుతూనే ఉంటుందని స్పష్టంచేశారు.

ఎస్‌కోట: మాట్లాడుతున్న ఎఐఐఇఎ నాయకులు

జిఎస్‌టి ఉపసంహరణ ఎఐఐఇఎ విజయం

శృంగవరపుకోట: దేశ వ్యాప్తంగా బీమా ఉద్యోగుల సంఘం (ఎఐఐఇఎ) (సిఐటియు అనుబంధం) చేసిన నిరంతర పోరాటం, ప్రజాభిప్రాయ సమీకరణ ఫలితంగా, కేంద్ర ప్రభుత్వం ఆరోగ్య, జీవిత బీమా ప్రీమియంలపై అమలలో ఉన్న 18శాతం జిఎస్‌టిని ఉపసంహరించుకుందని ఎస్‌కోట బేస్ యూనిట్ కార్యదర్శి జి రాకేష్ వర్మ అన్నారు. ఈ సందర్భంగా యూనియన్ పోరాటానికి కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి ఆరోగ్య, బీమా పాలసీలపై జిఎస్‌టిని ఉపసంహరించడం పట్ల పట్టణంలోని ఎల్ఐసి బ్రాంచ్ ఆఫీస్ ఎదుట సోమవారం యూనియన్ ప్లెక్సీని ప్రదర్శించి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాకేష్ వర్మ మాట్లాడుతూ ఈ విజయాన్ని సాధించడానికి ఎఐఐఇఎ 2004 నుంచి నిరంతర పోరాటం చేస్తూ వచ్చిందనీ 2017లో దేశ వ్యాప్తంగా 45.23 లక్షల సంతకాలను సేకరించి కేంద్రానికి సమర్పించిందని 2024 లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన వందలాది అభ్యర్థులను కలసి ఎన్నికల మేనిఫెస్టోలో ఈ అంశం చేర్చాలని విజ్ఞప్తి చేసిందని, ఈ నిరంతర పోరాటం ఫలితంగా, అన్ని పార్టీల మద్దతు లభించి, చివరకు జిఎస్‌టి కౌన్సిల్ ఈ అంశాన్ని చర్చించి ఉపసంహరణ నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో బేస్ యూనిట్ అధ్యక్షులు ఎస్.హారిక, ఎస్-ఎల్ఐసి ఎస్ కోట బ్రాంచ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ రణభేరి జయప్రదం చేయండి

ప్రజాశక్తి- సంతకవిటి

గుంటూరులో ఈనెల 25న నిర్వహించనున్న యుటిఎఫ్ రణభేరి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని యుటిఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు బూరాడ శ్రీనివాసం, డోల కృష్ణారావు సోమవారం సంతకవిటిలో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో గత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహించడంతో అప్పుడు పోరుబాట చేశామని, నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలల గడిచినా ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించటంలో చొరవ చూపకపోవడం తగదన్నారు. బోధనేతర పనులు రద్దుచేసి, ఉపాధ్యాయులను బోధనికే పరిమితం చేయాలన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని పటిష్ఠం చేయడానికి కృషి చేయాలని తెలిపారు. ఉమ్మడి సర్వీస్ రూల్స్ అమలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం విద్యా విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు.

కార్యకర్తలకు అండగా ప్రమాద బీమా

ప్రజాశక్తి- శృంగవరపుకోట

కార్యకర్తలకు పార్టీ ప్రమాద బీమా పథకం అండగా ఉంటుందని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. సోమవారం లక్కవరపుకోట టిడిపి కార్యాలయంలో ఎస్‌కోట మండలం ఎస్.కోట పట్టణ కేంద్రం గౌరీ నగర్ కాలనీకి చెందిన టిడిపి కార్యకర్త నాగభూషణం ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఆయన కుటుంబానికి ఎమ్మెల్యే సోమవారం టిడిపి ప్రమాద బీమా తరఫున మంజూరైన రూ.5లక్షల నగదును అందజేశారు. పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు జీస్ నాయుడు, రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్ర శేఖర్, ప్రధాన కార్యదర్శి జుత్తాడ రామసత్యం, కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


బీమా నగదును అందిస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

అగ్ని ప్రమాద బాధితులకు నిత్యావసరాలు

లక్కవరపుకోట మండలంలోని మార్లపల్లి గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో 5 ఇళ్ళు దగ్ధమైన సంగతి తెలిసిందే. సిఎఎస్ఆర్ నిధులతో ప్రతి కుటుంబానికి రూ.5వేలతో పాటు 25 కేజీల రైస్ బ్యాగ్, రగ్గులు, వంట సామాన్లు, ఇతర నిత్యావసర సరుకులను ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి సోమవారం అందించారు. ప్రమాద విషయాన్ని శారద యాజమాన్యం దృష్టికి తీసుకురాగానే తమ వంతు సహాయం చేశామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ చొక్కాకుల మల్లు నాయుడు, సర్పంచ్ గోగాడ సత్యం, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోషణ మాసోత్సవం

ప్రజాశక్తి- నెల్లిమర్ల

నగర పంచాయతీలోని పద్మసాలి వీధి సమీపంలోని నాయుడు కాలనీ అంగన్వాడీ కేంద్రంలో సోమవారం రాష్ట్రీయ పోషణ మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండవెలగాడ పిహెచ్‌సి వైద్యులు శిరీష నెల్లిమర్ల సెక్టార్ సూపర్ వైజర్ టి.త్రినాధమ్మ మాట్లాడుతూ అక్టోబర్ 16 వరకు రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలు జరుగుతాయన్నారు. ఆరోగ్య వంతమైన మహిళ, శక్తి వంతమైన కుటుంబానికి బలమైన పునాదిగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు ఎం. మంగలక్ష్మి, పి.దుర్గభవాని, ఏఎన్ఎం, ఆశా వర్కర్స్, సచివాలయం సిబ్బంది, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : మాట్లాడుతున్న డాక్టర్ శిరీష

రామభద్రపురం: మహిళలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని ఐసిడిఎస్ సిడిపిఒ వరహాలమ్మ అన్నారు. మండల పరిధిలోని ఆరికతోట అంగన్వాడీ కేంద్రంలో సోమవారం నిర్వహించిన పోషణ మహా ప్రోగ్రామ్‌లో భాగంగా గర్భిణులకు సీమంతాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు ఎక్కువగా పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు రత్నకుమారి, సూర్యకుమారి, కృష్ణకుమారి, అంగన్వాడీలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ప్రజారోగ్యం ప్రభుత్వ బాధ్యత

పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రజారోగ్యం ప్రభుత్వం బాధ్యతని పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు అన్నారు. సోమవారం ఐద్వా, పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అనిల్ నీరుకొండ ఆసుపత్రి వైద్య శిబ్బంది సహకారంతో ఎల్‌బిజి నగర్‌లో ఉచిత దంత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్యం రోజురోజుకూ దిగజారిపోతోందని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రభుత్వం స్పందించి ప్రజారోగ్యం కోసం నిధులు కేటాయించాలని కోరారు. అనిల్ నీరుకొండ ఆసుపత్రి వైద్య శిబ్బంది దంత వైద్య సేవలు అందించారని, ఇవి పేదలకు ఎంతో ఉపయోగపడ్డాయని ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ తెలిపారు. శిబిరంలో ప్రొఫెసర్ డాక్టర్ మణికంఠ, డాక్టర్ జ్యోతి, డాక్టర్ సృజన, డాక్టర్ దీపక్ సేవలందించారు. కార్యక్రమంలో పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు బి.రమణ, ఆర్.శ్రీను, యుఎస్ రవికుమార్, సుధీర్, ఐద్వా నగర కార్యదర్శి వి.లక్ష్మి, కుమారి పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన

ప్రజాశక్తి- బాడంగి

మండలంలోని ఆనవరం గ్రామంలో సోమవారం ఆయిల్ పామ్ పంటపై రైతులకి అవగాహన సదస్సు నిర్వహించారు. ఉద్యాన శాఖ, లక్ష్మీ బాలాజీ ఆయిల్ పామ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సంయుక్తంగా నిర్వహించిన సదస్సులో ఉద్యాన శాఖ అధికారి మోహన్‌కృష్ణ మాట్లాడుతూ దళారి వ్యవస్థ, మధ్య వర్తుల ప్రమేయం లేకుండా రైతులు నేరుగా ఆయిల్ పామ్ గెలలను కంపెనీ కొనుగోలు చేస్తోందన్నారు. ప్రస్తుతం ఉన్న టన్ను గెల ధర ప్రకారం రూ.19,095 రైతు ఖాతాకే నేరుగా వేస్తారన్నారు. సాగుకు మొక్కలను 100 శాతం సబ్సిడీ ద్వారా ఉచితంగా రైతులకు అందజేస్తా మన్నారు. ఒక హెక్టార్ సాగుకు గరిష్ట ంగా రూ.29 వేలు సబ్సిడీ ఉందని, అం తర పంటలు, పంట నిర్వహణ కోసం హెక్టార్‌కి ఏటా రూ.11,500 వరకు మొదటి నాలుగు సంవత్సరాలు సబ్సిడీ ఉంది అని రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ప్రస్తు తం ఉన్న టన్ను గెల ధర ప్రకారం ఒక ఎకరాకి ఖర్చులు పోను నికర ఆదాయం 1 లక్ష నుంచి 1.40లక్షల రూపాయలు వరకు ఉందని చెప్పారు. ఈ సదస్సులో లక్ష్మీ బాలాజీ ఆయిల్ పామ్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజర్, రైతులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి

రామభద్రపురం: గతంలో వివిధ కారణాల వల్ల నిలిచిన పెండింగ్ ఇళ్ళ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ ఎఇ వెంకటేష్ కోరారు. సోమవారం రొంపల్లి సర్పంచ్ శంకర్రావుతో కలిసి ఇళ్ళు నిర్మాణాలు పెండింగ్ ఉన్న ప్రతీ ఇంటికి వెళ్ళి అవగాహన కల్పించారు. కూటమి ప్రభుత్వం ఈ ఇళ్లకు అదనంగా రూ.50 వేలు ఇస్తున్నట్లు ప్రకటించిందని వెంటనే నిర్మాణాలు ప్రారంభించాలని కోరారు. నూతన ఇళ్ళకి 1360 మంది దరఖాస్తులు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ సురేష్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ చైతన్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

రెవెన్యూ పరిశీలకులుగా కోటగిరి బాధ్యతలు

రేగిడి: తహశీల్దార్ కార్యాలయ పరిశీలకులుగా కోట గిరి సోమవారం అదనపు బాధ్యతలు చేపట్టారు. ఇంతవరకు పని చేసిన రవికుమార్ తన మాతృశాఖ గ్రామ రెవెన్యూ అధికారిగా వెళ్లారు. కోట గిరి జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తూ, అదనంగా రెవెన్యూ పరిశీలకులుగా బాధ్యతలు చేపట్టారు.

నీటి సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జరజాపుపేట హౌసింగ్ కాలనీకి నీటి సౌకర్యం కల్పించాలని నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు సోమవారం కలెక్టర్ గ్రీవెన్స్‌లో కోరారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ 133 ఇళ్ళు మంజూర య్యాయని వీటిలో 49 ఇళ్ళు పూర్తి చేసి మిగతా 70 ఇళ్ళు పునాది స్థాయి నుంచి రూఫ్ లెవెల్‌కి వచ్చాయని తెలిపారు. అయితే నీటి సౌకర్యం లేక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని బోర్లు మంజూరు చేయాలని గ్రీవెన్స్ లో కోరారు.

ఓటర్ల జాబితాపై సమీక్ష చేయండి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

2002 ఓటరు జాబితాలో ఉన్న పేర్లపై సమీక్ష చేసి వారిలో ప్రస్తుతం బతికి ఉన్న వారి పేర్ల జాబితాను బూత్ లెవెల్ అధికారులు తక్షణమే తయారు చేయాలని తహశీల్దార్ కె. శ్రీకాంత్ ఆదేశించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బిఎల్ఒలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2002 ఓటర్ల జాబితాతో పాటు 2005 ఓటర్ల జాబితాను కూడా బిఎల్ఒలకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ 2002లో ఓటు హక్కు ఉండి, ఆ జాబితాలో పేర్లు కలిగి ఉండి ప్రస్తుతం బతికి ఉన్న వారి పేర్లు జాబితా తయారు చేయాలని, దీనిని బట్టి బతికి ఉండి ఓటర్ జాబితాలో పేర్లు లేని వారి వివరాలు తెలుస్తాయని ఆయన అన్నారు. ఈ అంశంలో బిఎల్ఒలు ఎలాంటి నిర్లక్ష్యమూ ప్రదర్శించకుండా అప్రమత్తంగా వ్యవహరించి తయారు చేసిన జాబితాలను ఈ నెల 25వ తేదీలోగా తమ కార్యాలయానికి అందజేయాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దారు వివిఆర్ జగన్నాధరావు, రీసర్వే డిటి సత్యనారాయణ, భాస్కరరావు, మహేష్ పాల్గొన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

శృంగవరపుకోట: మండలంలోని కిల్తంపాలెం పంచాయతీ బర్తాపురం గ్రామంలో యాత్రికులచే చిన్న తిరుపతిగా కీర్తింపబడుతున్న శ్రీకళ్యాణ ప్రసన్న వైభవ వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకూ శ్రీవారి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు శ్రీవెంకటేశ్వర చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు సోమవారం తెలిపారు.

ప్రజాప్రతినిధులుగా బాధ్యతను నిర్వర్తించాలి

ప్రజాశక్తి - చీపురుపల్లి

ప్రజా ప్రతినిధులుగా మన బాధ్యతను నిర్వర్తించాలని గుర్ల ఎంపిపి పొట్నూరు ప్రమీల అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, ఎంపిటిసిలు, కార్యదర్శులకు సంబంధించి స్థానిక సుస్థిరత అభివృద్ధిపై రెండు రోజులపాటు జరగనున్న శిక్షణా కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఓటు వేసిన ప్రజలకు న్యాయం చేకూరే విధంగా గ్రామాలలో ప్రజలు మనకు తెలియజేస్తున్న సమస్యలపై దృష్టి సారించి వాటిని పరిష్కరించే దిశగా ఆలోచన చేయాలన్నారు. ప్రధానంగా తాగునీరు, పారిశుధ్యంపై దృష్టి పెట్టి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా చూడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సురేష్, పరిపాలనాధికారి తామరపల్లి ప్రవీణ్ కుమార్, సర్పంచులు, ఎంపిటిసిలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి ప్రమీల

గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

గుర్ల: గ్రంథాలయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి పొట్నూరు ప్రమీల అన్నారు. రూ.2లక్షల మండల పరిషత్తు నిధులతో నిర్మించిన గుర్ల శాఖా గ్రంథాలయ ప్రహరీని ఆమె సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుస్తక పఠనం వల్ల విద్యార్థుల మేధాశక్తి పెరుగుతుం దన్నారు. పోటి పరీక్షలకు తగినంత పుస్తక సదుపాయాలు మన గ్రంథాలయంలో అందుబాటులో ఉండడం శుభ పరిణామం అన్నారు. గ్రంథాలయం అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సీర అప్పలనాయుడు, వైసిపి నాయకులు కె.వి సూర్య నారాయణ రాజు, వైసిపి మండల అధ్యక్షులు పొట్నూరు సన్యాసి నాయుడు, మండల విద్యాశాఖ అధికారి భానుప్రకాశ్, గ్రామ నాయకులు ఇజ్జిరోతు ప్రసాద్, మంత్రి వెంకట రమణ పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

గర్భిణులు, మహిళలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని సర్పంచ్ గదల బంగారమ్మ కోరారు. మండలంలోని కొండవెలగాడ గ్రామంలో సోమవారం స్వస్త్ నారీ స్వశక్తి పరివార్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం పారిశుధ్యం, ఆరోగ్య పరిరక్షణపై ప్రజలందరికీ అవగాహన కల్పిం చారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ వై.దనంజయ్, డాక్టర్ పివి శిరీష, సిబ్బంది, అంగన్వాడీ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

చీపురుపల్లి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వస్తి నారి స్వశక్తి పరివార్ మెడికల్ క్యాంపుని సద్వినియోగం చేసుకోవాలని వైసిపి జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలి రెడ్డి శ్రీనివాస్ నాయుడు కోరారు. సోమవారం పట్టణంలోని విజయకాలనీలో కూరాకుల కమ్యూనిటీ హాల్ వద్ద కర్లాం ప్రైమరీ హెల్త్ సెంటర్, ఐసిడిఎస్ సంయుక్తంగా ఏర్పాటు వైద్య శిబిరాన్ని, అక్కడ ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆయన సందర్శించారు. కార్యక్రమంలో కర్లాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శ్రీలక్ష్మి, కోరుకొండ దాలయ్య, కర్రోతు ప్రసాద్, మల్లెంపూడి శ్రీను, ప్రభాత్ కుమార్, పాల్గొన్నారు.

గజపతినగరం: మండలంలోని తుమ్మికాపల్లి గ్రామంలో సోమవారం స్వస్త్ నారి సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని, ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోషణ మహా కార్యక్రమం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి యం.రాజేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించారు. అంగన్వాడి కార్యకర్తలు పోషకాహార స్టాల్‌ను పెట్టి గర్భిణులు, బాలింతలు, కిషోర్ బాలికలకు ఆహార అలవాట్లు గురించి వివరించారు. ఎంపిపి బెల్లాన జ్ఞాన దీపిక పాల్గొని పోషకాహార స్టాల్‌ను పరిశీలించారు. అంగన్వాడీ కార్యకర్తలు సుభాషిణి, జయ లక్ష్మీ, పైడిరాజు పోషక విలువలు గురించి వివరించారు.

శృంగవరపు కోట: మహిళలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని కొట్టం పిహెచ్‌సి డాక్టర్ లావణ్య అన్నారు. స్వస్త్ నారి స్వశక్తి పరివార్ అభియోగ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎస్‌కోట తలారి హెల్త్ సెంటర్‌లో 160 మంది మహిళలకు 14 రకాల పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి రెడ్డి వెంకన్న, సర్పంచ్ రండి అరుంధతి, గ్రామ పెద్దలు వెంకట్రావు, ఎంఎల్ హెచ్‌పి, ఎఎన్ఎం, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

దత్తిరాజేరు: మహిళలు ఆరోగ్యం పట్ల దృష్టి సారించాలని డాక్టర్ కె.రఘు అన్నారు. షికారుగంజి గ్రామంలో సోమవారం స్వస్త్ నారీ స్వశక్తి కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ సుంకర వెంకటరమణ ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రఘు 110 మందికి ఆరోగ్య తనిఖీలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ డి.వి గిరిబాబు, ఎంపిహెచ్ఒ డి.మురళీ, శ్రీనివాసరావు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

రామభద్రపురం: ప్రజల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఆరికతోట పిహెచ్‌సి వైద్యాధికారి అపర్ణ తెలిపారు. సస్తి నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆరికతోట పిహెచ్‌సిలో మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

VIZIANAGARAM MUNICIPAL CORPORATION

e-Proc.short NIT No.1269/32/E/TO/2025-26, Dt.22-09-2025.

Providing of Temporary Toilets, Painting, Engaging of man Mazdoors under General funds, Est Cost Rs.21.59 Lakhs.

Download start date & time	Dt.23-09-2025 from 10.30 A.M.
Download end date & time	Dt.26-09-2025 upto 10.30 A.M.
Bid Submission Closing Date&Time	Dt.26-09-2025 upto 11.00 A.M.
Bid opening date & time	Dt.26-09-2025 upto 11.30 A.M.

Contact Nos.9849908295, 9849907020. Further details can be seen at **www.apeprocurement.gov.in.**

COMMISSIONER

మహారాజశ్రీ బొబ్బిలి సినియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
EP 7/2024, OS 1255/2009

Between :
Pasagodugula Vijay .....DHR/వాది
And :
Althi Venkata Ramana ...JDR/ప్రతివాది
To
ఆల్తి వెంకటరమణ, S/o కన్నయ్య, గొల్లవీధి, పారాది గ్రామం, బొబ్బిలి మండలం, విజయనగరం జిల్లా.

యిందలి DHR మీపై OS 1255/2009 లో తే 01-02-2012దీన పొందిన డిక్రీ అమలు కోరుతూ, సదరు దావాలో IA 1594/2009లో ప్రధమ జప్తు కాబడిన షెడ్యూలు దాఖలా ఆస్తులను వేలం వేయించడము మూలంగా యి అమలు మొత్తం మీ వద్ద నుండి రాబట్టు నిమిత్తం యి అమలు దాఖలు చేసియున్నారు. సదరు అమలులో OR 21 R22 CPC నోటీసులు కోర్టువారు జారీ చేసియున్నారు. మీరు బుద్ధి పూర్వకంగా తీసుకోనందున, కోర్టువారి ఆర్డరు ప్రకారం యి ప్రకటన చేయడమైనది. పై నెంబరు అమలు **తే 09-10-2025దీ**కి వాయిదా అయి వున్నది. **వాయిదా తేది ఉదయం 10-30 గంllలకు** స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై మీ యొక్క ఆక్షేపణలు వ్రాత పూర్వకంగా కోర్టువారికి తెలియచేసుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున తదుపరి ఉత్తర్వులు జారీ కాబడునని యిందుమూలంగా తెలియచేయడమైనది.

//కోర్టు వారి ఆర్డరు ప్రకారం//

అల్లాడ నగేష్ కుమార్
న్యాయవాది,
పారాది, బొబ్బిలి
బొబ్బిలి
తే 22-9-2025 ది సెల్ : 9849879051

మహారాజశ్రీ గజపతినగరం జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టులో
O.S.No.76/2019 IN E.P.No.8/2024

BETWEEN:
కోరాడ సత్యనారాయణ .....డిక్రీ హోల్డర్
మరియు :
కర్రోతు నర్సింగరావు .....జడ్జిమెంట్ డిటార్

పై నెంబరు అమలులో జడ్జిమెంట్ డిటార్ నుండి డిక్రీ బాకీ వసూలు చేయు నిమిత్తము ఈ క్రింది హద్దులు మధ్య గల R.C.C.స్లాబు ఇంటిని పై కోర్టులో **తే:14.10.2025దిన ఉదయం 10.30 నిమిషముల నుండి సాయంత్రం 5.00 గంటల** వరకు వేలం వేయబడును, గాన వేలం పాటలో పాల్గొన దలచిన వారు వేలం పాట పాడుకోవలసినదిగా ఈ ప్రకటన మూలముగా తెలియ చేయడమైనది.

SCHEDULE

DISTRICT : Vizianagaram; SUB-REGISTRAR: Gajapathinagaram, REVENUE MANDAL : Bondapalli; VILLAGE : MaruvadaKothavalasa RCC Slabbed building H.No.3-11, to an extent of 57.77 square yards, in S.No.67, Assessment No.236 of Maruvada Kothavalasa Village, Bondapalli Mandal, Vizianagaram District.

BOUNDED ON:-
East : House of Karrothu Suri Babu
South : C.C.road
West : House of Karrothu Krishna
North : House of Pandranki Tata Raju & Tata Rao,

Amin Value : Rs.8,00,000/-
D.H.R.Value : Rs.6,00,000/-
J.D.R. Value : Not Furnished

KALISETTI RAMU NAIDU
M.Com., B.L., I.R.P.M,
ADVOCATE & NOTARY.
KOMATIPALLI (Village & Po)
Dattirajeru (Mdl),
Vizianagaram (Dist)-535560
Cell:9989370480